క్లుప్తంగా

క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శ్రావణ్ కుమార్



రంగంపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలపై మండలంలోని మర్రిపూడి గ్రామానికి చెందిన మోర్త శ్రావణ్ కుమార్‌ను పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్‌కు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, నాయకులు అభినందనలు తెలిపారు. కాగా.. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు శ్రావణ్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వీరభద్రస్వామి తీర్థమహోత్సవాలు ప్రారంభం



రంగంపేటలో వీరభద్రస్వామివారి ఊరేగింపు

రంగంపేట: స్థానిక సాయినగర్‌లోని వీరభద్రస్వామి వారి 40వ వార్షిక తీర్థ మహోత్సవాలు సోమవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కేతా సత్యనారాయణ, జానకి దంపతులతో ఆలయ అర్చకుడు దేవరబొట్ల శిరిడిసాయిశర్మ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వీరభద్రుని నృత్య గీతాలతో ప్రత్యేక వాహనంతో స్వామివారి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు బొట్టు స్వామి, యానాపు త్రిమూర్తులు, కొండి జెమీ, గొలగాన బాబూరావు, బల్లసాని రవి మాట్లాడుతూ ఈనెలాఖరు వరకు ఉదయం ప్రత్యేక పూజలు, రాత్రికి సామూహిక భజనలు చేస్తామన్నారు. వచ్చే నెల 2వ తేదీన ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ఆవరణలో భారీ అన్నదానం నిర్వహిస్తామన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు

సీతానగరం: మండలంలోని వంగలపూడి, సింగవరం ర్యాంపులలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందని వంగలపూడి సర్పంచ్ కాండ్రేగుల ఫణి ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, భారీ యంత్రాలతో వీటిని నిర్వహిస్తున్నారంటూ ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సింగవరంలో తవ్వకాల జరిపి, వంగలపూడి ర్యాంపు నుంచి రవాణా చేస్తున్నారన్నారు. మూడు మీటర్లకు బదులుగా ఇరవై మీటర్లు లోతున తవ్వకాలు జరుపుతున్నారన్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లారీలపై ఇసుక తరలించాలని, కానీ 24 గంటలూ రవాణా జరుగుతోందన్నారు.

ముంపు సమస్యను పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు, రైతులు

సీతానగరం: మునికూడలిలో ముంపు సమస్యను తక్షణం పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, పార్టీ నాయకుడు గూడపాటి జయరామ్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ఎంపీడీవో ఎం.భారతికి వినతిపత్రం అందించారు. మునికూడలి వద్ద సుమారు 40 ఎకరాలు, అలాగే కాలనీ ముంపునకు గురవుతోందన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డును వెడల్పు చేయడంతో తూరలు మూసుకుపోయాయని తెలిపారు. దీనితో నీరు వెళ్లడం లేదని, కాటవరం ఇసుక ర్యాంపు, మునికూడలి గ్రామాల మధ్య రోడ్డుకు ఏటిగట్టుకు మధ్యలో ఉన్న సుమారు 40 ఎకరాలతో పాటు మునికూడలి కాలనీ ముంపునకు గురవుతోందన్నారు.

భారీ లారీలతో భయాందోళన

కోరుకొండ: మండలంలోని వివిధ గ్రామాల చెరువుల నుంచి మట్టిని భారీ వాహనాలపై తరలిస్తున్నారు. ఇవి అతి వేగంగా రోడ్లపై పరుగులు తీస్తూ ప్రజలను భయపెడుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో రవాణా జరగడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. శ్రీరంగపట్నం, రాఘవపురం, నర్సాపురం, కనుపూరు గ్రామాల్లో మట్టిని రవాణా చేస్తున్నారు. గాదరాడ సమీపంలోని పుష్కర, పోలవరం గట్ల మట్టిని కూడా తరలిస్తున్నారు.

ధగధగా..

- కొందరు వ్యాపారుల అత్యాశ
- మామిడిపండ్లు పండించేందుకు రసాయనాల వినియోగం
- రంగే తప్ప రుచి ఉండని వైనం
- ఆరోగ్యంపై దుష్ప్రభావం

రంగంపేట: వేసవి కాలం అంటేనే మామిడి కాయల సీజన్. ఈ సమయంలో దొరికే మామిడి కాయలంటే పిల్లల నుంచి పెద్దల వరకూ ఎంతో ఇష్టపడతారు. ప్రస్తుతం రోడ్ల పక్కన, ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో మామిడి కాయల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పసుపు రంగులో నిగనిగలాగే పండ్లను ప్రజలందరూ కొనుగోలు చేస్తున్నారు. అయితే కొందరు వ్యాపారులు మాత్రం డబ్బుల కోసం అత్యాశకు పోతున్నారు. మామిడి కాయలను పండించటానికి రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇలా పండించిన కాయలు తింటే అనారోగ్యాలు ప్రబలుతాయి.

ఆ పండ్లు హానికరం

మామిడి కాయలు పూర్తిగా పరువుకు వచ్చిన తర్వాత సేంద్రియ పద్ధతిలో మగ్గ పెడితే, వాటి సువాసన వెదజల్లడంతో పాటు అత్యంత మధురంగా ఉంటాయి. రసాయనాలతో మగ్గించిన పండ్లు రుచిగా ఉండవు సరికదా, ఆరోగ్యానికి కూడా హానికరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతేకాక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఈ ప్రక్రియ చట్ట ప్రకారం నేరం కూడా. రసాయనాలతో మగ్గించిన పండ్లను తినడం వల్ల జీర్ణక్రియ, క్యాన్సర్ వంటి సమస్యలు ఏర్పడతాయి. కొందరు వ్యాపారులు తమ ఇళ్లలోని ఒక గదిలో మామిడి కాయలను ఉంచి కార్బైడ్ ద్వారా మగ్గిస్తున్నారు. అలాగే కొన్ని రకాల రసాయనాలను నీటిలో కలిపి మామిడి కాయలను వాటిలో ముంచి పక్కన పెడితే, ఒక్క రోజులోనే నిగనిగలాడుతూ మెరుస్తుంటాయి. రంగు బాగుండడంతో వాటిని కొనడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అయితే రసాయనాలతో పండ్లను మగ్గించడం నేరం. దానికి పాల్పడిన వారికి కనీసం మూడు నెలల జైలు, రూ. లక్ష వరకూ జరిమానా విధించే అవకాశం ఉంది.

వ్యత్యాసమిదే..

సహజంగా పండిన మామిడి పండ్లు, రసాయనాలతో మగ్గించిన పండ్లను గుర్తించడంలో ఒక సులువైన మార్గం ఉంది. సహజంగా పండిన మామిడి పండును నీటిలో వేస్తే అది మునిగిపోతుంది. అదే రసాయనాలతో మగ్గించిన పండు అయితే పండు పెద్దది అయినప్పటికీ, బరువు ఉన్నా నీటిలో వేస్తే తేలిపోతుంది. అలాగే సహజంగా పండిన పండు నుంచి సువాసన వస్తుంది. అదే రసాయనాలతో మగ్గించిన పండు నుంచి వాసన రాదు. సహజంగా పండిన పండు లోపలి భాగం బంగారు రంగులో ఉంటుంది. రసాయనాలతో మగ్గించిన పండు కోస్తే లోపలి భాగం లేత తెలుపురంగులో ఉంటుంది.



రంగంపేటలో విక్రయానికి సిద్ధం చేసిన మామిడి పండ్లు

రైఫినింగ్ చాంబర్లు

మామిడి పండ్లను ఎటువంటి విషపూరిత రసాయనాలు వినియోగించకుండా మగ్గబెట్టేందుకు ప్రభుత్వం రైఫినింగ్ చాంబర్ల ఏర్పాటును ప్రోత్సహించాలి. రైతులే కాకుండా వ్యాపారులు కూడా తమ పండ్లను ఈ చాంబర్లలో మగ్గించుకోవచ్చు. రైఫినింగ్ చాంబర్‌లో మొదటి రోజు ఏసీ ద్వారా శీతలీకరణ చేస్తారు. తర్వాత రోజు నుంచి మూడు రోజుల పాటు ఇథలిన్ గ్యాస్ పంపించి కాయలను మగ్గిస్తారు. కాయ పండులా మారడానికి నాలుగు రోజుల సమయం పడుతుంది. రైఫినింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసుకునే వారికి 35 శాతం వరకు ఉద్యానవన శాఖ రాయితీ అందిస్తోంది.

తగ్గిన దిగుబడి

జిల్లాలో 14,122 ఎకరాలలో మామిడి పంట సాగవుతుంది. గోకవరం, కోరుకొండ మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో మామిడి తోటలు ఉండగా గోపాలపురం, రాజానగరం, రంగంపేట మండలాల్లో తక్కువ విస్తీర్ణంలో సాగవుతున్నాయి. ఎకరాకు కనీసం ఐదు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మామిడి కాయలను స్థానికంగా విక్రయించడంతో పాటు పెద్ద పట్టణాలకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే ఈ ఏడాది దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఇతర ప్రాంతాలకు అంతంత మాత్రమేగానే ఎగుమతులు చేస్తున్నారు.

ఆ పండ్లు తినకూడదు



రసాయనాలతో మగ్గించిన మామిడి పండ్లు తింటే ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా జీర్ణకోశ వ్యాధి, ప్రేగులు దెబ్బతినడంతో పాటు క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. పూర్తిగా పక్వానికి రాని ఏరకమైన పండ్లనూ తినరాదు.

– బి.వేణుశ్రీలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, రంగంపేట

రాయితీపై రైఫినింగ్ కేంద్రాలు



రైఫినింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనుకునే రైతులు, వ్యాపారులు సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. జనరల్ కేటగిరీ వ్యక్తులకు 35 శాతం రాయితీతో పథకం వర్తింపజేస్తాం. పూర్తి వివరాలకు సచివాలయాల ఉద్యానవన సహాయకులను సంప్రదించాలి.

– కె.దివ్యశ్రీ, ఉద్యానవన అధికారి, రంగంపేట

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



వేసవి శిక్షణకు హాజరైన విద్యార్థులు

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. 24వ రోజు సోమవారం లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. చదవడం మాకిష్టంలో భాగంగా 'చందమామ' అనే కథను చదివించారు. వారికి చదరంగం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విశ్రాంత సహాయ సంక్షేమ అధికారి ఓఎస్ సురేష్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి.. విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌పై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

అనపర్తి : రైజింగ్ హాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కడియపులంక గ్రామానికి చెందిన బక్కి విజయ శరత్ కుమార్, సంధ్య దంపతులు వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. వారి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తేతలి రామిరెడ్డి, మంగయమ్మ ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో విజయ శరత్ కుమార్ దంపతుల కుమార్తెలు రోషిణి, దేదీప్య, ఆశ్రమ వ్యవస్థాపకాధ్యక్షుడు నల్లమిల్లి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న 'సత్యసాయి' నీరు



పుష్కర కాలువ వద్ద లీకవుతున్న నీరు

కోరుకొండ: ప్రజలకు రక్షిత నీరు అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన సత్యసాయి తాగునీటి పథకం నిర్వహణలోపంతో నిరుపయోగంగా మారుతోంది. కూటమి పాలనలో మెయింటెనెన్స్ కొరవడటంతో పైపులైన్లు పగులుతున్నాయి. తద్వారా భారీగా రక్షిత నీరు వృథాగా పోతోంది. మండలంలోని నర్సాపురం – కణుపూరు గ్రామాల మధ్యలో ఉన్న పుష్కర కాలువ వద్ద పైపులైన్ నుంచి నీరు లీకవుతోంది. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి వర్షపు నీటితో పాటు సత్యసాయి పథకం నీరు చేరడంతో పుష్కర కాలువ గట్టు నీటిమయమైంది. దీంతో కణుపూరు, రాజవరంతో పాటు గోకవరం మండలం తిరుమలాయపాలెం, మల్లిసాల, గంగంపాలెం గ్రామాలకు చెందిన వాహనచోదకులు, ప్రయాణికులు ఆగిపోయారు. సుమారు 2 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే వాటర్ ట్యాంకు నర్సాపురంలో ఉంది. ఇక్కడి నుంచి కణుపూరు. రాజవరం, గాదరాడ గ్రామాల ప్రజలకు నీటి సరఫరా జరుగుతోంది. ఈపైపులైన్ పగలడంతో సోమ, మంగళ, బుధవారాల్లో నీటిసరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

రేషన్ షాపుల వద్దే సరకులు

సీతానగరం: రేషన్ కార్డుదారులు తమ సరకులను నేరుగా రేషన్ దుకాణం నుంచే తీసుకోవాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల వద్దకు వెళ్లి బియ్యం, పంచదార తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఎండీయూ వాహనాల ద్వారా నేరుగా ఇళ్లకు రేషన్ సరకులు అందించేవారని, వాటిని ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు.

సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

పెదపూడి: గ్రామంలోని ప్రాచీన శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు.. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కె.వెంకట్రావు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కూటమి పాలనలో మహిళలకు భద్రత కరవు



మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని కలిసిన మార్తి లక్ష్మి తదితరులు

అనపర్తి : కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరవైందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి అన్నారు. ఆమె సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి నూతనంగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మిని అభినందించారు. కూటమి ప్రభుత్వ దమనకాండను నిలువరించాలంటే మహిళా శక్తి కూడా పార్టీకి తోడవ్వాలన్నారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం నేతలు కొప్పోలు అనురాధ, కృష్ణవేణి, బొంతు మణి, పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ డైరెక్టర్ మార్తి నాగేశ్వరరావు, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ అనపర్తి మండల కన్వీనర్ సత్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆ ముసుగులు తొలగించాలి

రాజానగరం: గ్రామ ఆవిర్భావానికి ప్రధాన కారణంగా ఉన్న స్థానిక రావులచెరువును గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేశారని, నేడు ఆ అభివృద్ధిని కనిపించకుండా బోర్డులకు క్లాత్‌తో ముసుగులు వేశారని పంచాయితీ సభ్యులు విమర్శించారు. తక్షణమే వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీకి చెందిన ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, వార్డు సభ్యులు ప్రగడ చక్రి, ఉప్పల అనంతలక్ష్మి, మట్ట సత్యదేవి, యక్కల నాగేశ్వరరావు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో వినితిపత్రం అందజేశారు. ఇదే విషయమై రాజానగరం ఎంపీడీఓకు కూడా వినతిపత్రం అందజేశామన్నారు. దశాబ్దాలు తరబడి కలుషితమై ఉన్న చెరువును గతంలో పాలకులు ఎవ్వరూ పట్టించుకోకపోతే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమ ఎమ్మెల్యే (అప్పటి) జక్కంపూడి రాజా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధి చేశారన్నారు. అంతేకాక పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు పార్కు, యువత కోసం జిమ్ కూడా ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం అందరూ వాటిని ఉపయోగించుకుంటుంటే కూటమి నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు.

పలు సమస్యలపై ఫిర్యాదులు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ పలు అర్జీలు అందుకున్నారు. ఎస్సీ ఏరియాలోని విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటి స్థానంలో కొత్తవి నెలకొల్పాలని రాపాకకు చెందిన కొల్లి రాజు, పట్టాదారు పాస్‌బుక్ డీకేపీలో సరిహద్దులు చూపాలని రాపాకకు చెందిన కొడమంచిలి సంధ్య, తన స్థలాన్ని పెద్ద కుమారుడి పేరుపై మార్చడానికి ఓనర్‌షిప్ సర్టిఫికెట్ అందించాలని శ్రీరామనగరానికి చెందిన తమ్మిశెట్టి రామలక్ష్మి అర్జీలు అందించారు. మరో రెండు సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, కంప్యూటర్ ఆపరేటర్ సతీష్ పాల్గొన్నారు.

తరల్ శిక్షణకు ఇద్దరు ఉపాధ్యాయుల ఎంపిక



తరల్ శిక్షణకు ఎంపికైన కృష్ణమోహన్, శ్రీనివాస్

కంబాలచెరువు: టీచింగ్ ఎట్ ద రైట్ లెవెల్ (తరల్) రాష్ట్రస్థాయి శిక్షణకు నగరంలోని ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన వరహాగిరి కృష్ణమోహన్, ధాన్యంపాకలు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల నుంచి నుంచి సిద్దనాతి శ్రీనివాస్‌ను ఎంపిక చేసినట్టు జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎ.గౌరీశంకరరావు సోమవారం తెలిపారు. వీరిద్దరూ ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఏలూరు జిల్లా అగిరిపల్లిలోని హీల్స్ పేరడైజ్ పాఠశాలలో 3, 4, 5 తరగతులకు సంబంధించిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు సాధించేందుకు నిర్వహిస్తున్న తరల్ శిక్షణకు హాజరవుతారు. అనంతరం జిల్లాలలో ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. వీరిద్దరినీ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్, ఎంఈఓ ఎం.సుబ్రహ్మణ్యం అభినందించారు.

మన ఆరోగ్యం– మన బాధ్యత



యోగాసనాలు వేస్తున్న జేసీ చిన్నరాముడు

- యోగాంధ్రలో స్వచ్ఛందంగా పాల్గొనాలి
- జేసీ చిన్న రాముడు

సీటీఆర్ఐ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జూన్ 21న విశాఖపట్నంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు విజ్ఞప్తి చేశారు. ఆర్ట్స్ కళాశాల సమీపంలోని గ్రాండ్ ట్రంక్ రోడ్డు మార్గంలో సోమవారం ప్రారంభమైన యోగాంధ్ర అభ్యాస జిల్లా స్థాయి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయవచ్చన్నారు. ఈ నెల 26 నుంచి జూన్ 20 వరకూ ఇదే ప్రదేశంలో ప్రతి రోజూ యోగాభ్యాస తరగతులు నిర్వహిస్తామన్నారు. యోగా గురువు నాగేశ్వరరావు దిశానిర్దేశంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.

భక్తిశ్రద్ధలతో భాగవత సప్తాహం



ప్రవచనం చెబుతున్న సురేష్ దాస్ బ్రహ్మచారి

సీటీఆర్ఐ: ఆధ్యాత్మిక మార్గాన్ని చేరుకోవాలంటే భాగవతం చదవడం, వినడం చేయాలని భాగవతా భక్త శ్రీపాద సురేష్ దాస్ బ్రహ్మచారి అన్నారు. స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలో మూడు రోజులుగా భాగవత సప్తాహం ప్రవచనం జరుగుతోంది. బ్రహ్మచారి మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భాగవత సప్తాహం ప్రవచనం జరుగుతుందన్నారు. భక్తులు ప్రవచాన్ని ఆలకించి, తిలకించి పునీతులు కావాలన్నారు.

పొగాకు సాగులో సుస్థిరతకు ప్రోత్సాహం



ఆవుల్ టెక్నో సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న ఐకార్-నిర్మా డైరెక్టర్ శేషుమాధవ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకు సాగులో సుస్థిరతను ప్రోత్సహించేందుకు ఐకార్ – నిర్మా, ఆవుల్ టెక్నో మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని నిర్మా డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. దీని ద్వారా సంప్రదాయ కలప ఆధారిత ఆరబెట్టే పద్ధతికి ప్రత్యామ్నాయంగా శక్తి పరిరక్షణ, పర్యావరణ అనుకూలత కలిగిన ఎలక్ట్రిక్ పద్ధతుల వైపు మారడానికి ముందడుగు పడనుందన్నారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) మోడల్‌లో ఎఫ్‌సీవీ పొగాకు ఆకులను ఆరబెట్టే ఎలక్ట్రిక్ హాట్ ఎయిర్ పంప్ రూపకల్పన, మౌలిక విశ్లేషణ, ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కలప వినియోగాన్ని తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను నియంత్రించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. ఇది భారతదేశ పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు. ఆవుల్ టెక్నో సంస్థ పొగాకు పంటలో తక్కువ వ్యయం, అధిక విలువ కలిగిన పోస్ట్-హార్వెస్ట్ పరిష్కారాలను అందించేందుకు లాట్ ఆధారిత సాంకేతికతను సమన్వయం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

నాయీ బ్రాహ్మణులకు శిక్షణ ఇవ్వాలి



కలెక్టర్ ప్రశాంతికి వినతి పత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

సీటీఆర్ఐ: నాయీ బ్రాహ్మణ యువతకు, మహిళలకు శిక్షణ ఇచ్చి, కులవృత్తిని ప్రోత్సహించి తమకు జీవనాధారం చూపించాలని నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు కలెక్టర్ ప్రశాంతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, సంఘ నగర అధ్యక్షుడు కందికొండ అనంత్, సెక్రటరీ రాజాన సత్తిరాజు, ట్రెజరర్ ముక్కాల సందీప్, జాయింట్ సెక్రటరీ వైమధు తదితరులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఇటీవల స్పా సెలూన్ పేరుతో పెట్టిన సంస్థల్లో అనేక సంఘ వ్యతిరేక పనులు చేస్తున్నట్లు వార్తలు రావడం, వారిపై కేసులు కూడా నమోదు కావడం జరుగుతోందన్నారు. దీనివల్ల తమ గౌరవ ప్రదమైన క్షవరవృత్తికి చెడ్డ పేరు వస్తోందన్నారు. ముఖ్యంగా బార్బర్ షాపులకు అద్దెకు ఇవ్వడానికి ముందుకు రావడం లేదన్నారు.

జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మెంటార్‌గా సుసత్య రేఖ

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయిని మేకా సుసత్య రేఖ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక జాతీయ మెంటరింగ్ మిషన్ నుంచి ఆహ్వానాన్ని అందుకున్నారు. భారత ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మానస పుత్రిక న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 20 – 20 వికసిత్ భారత్ 2047 అభియాన్‌లో భాగంగా ప్రతిష్ఠాత్మకమైన జాతీయ మెంటరింగ్ మిషన్ ఏర్పాటు చేసింది. జాతీయ స్థాయిలో బోధనా రంగంలో నూతన ఒరవడిని సృష్టించిన, సాంకేతిక రంగ నిపుణులైన ఉపాధ్యాయులను జాతీయ స్థాయిలో ఎంపిక చేసి ఒక బృందంగా ఏర్పాటు చేశారు. దీనిలో భాగస్వాములు కావాలని మేకా సుసత్య రేఖను ఆహ్వానించారు.

పీహెచ్‌డీకి ఎంపికైన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ ఆఖరి సంవత్సరం చదువుతున్న బూలా వెంకట రాజు, దూనబోయిన సాత్విక, పేరాల శేఖర్.. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ఫుల్ టైం చేయడానికి అర్హత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే సోమవారం తెలిపారు. తమ విద్యార్థులు ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి, ఆ తర్వాత ఇంటర్వ్యూలో ప్రతిభ చూపించి విజయం సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఉపకార వేతనంతో కూడిన ఫుల్ టైం పీహెచ్‌డీ చేయడానికి అర్హత పొందడం స్ఫూర్తిదాయకమని గణిత శాస్త్ర విభాగాధిపతి జి.చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు. వారికి గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ పతకాలను బహూకరించి సత్కరించారు.